నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ బుధవారం 10 ఏప్రిల్ 2024 | ADILABAD NIRMAL

# పండుగ పూట విషాదం

## వాంతులు చేసుకుని చిన్నారి మృత్యువాత



శృతిలయ(ఫైల్)

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 9 : హర్కాపూర్ అంధ్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కైలాస్‌నగర్ గ్రామానికి చెందిన చిన్నారి శృతిలయ(6) వాంతులు చేసుకుని మృతిచెందింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. డాకురే రాము-మంజుల దంపతులకు శృతిలయ, పృథ్వీరాజ్‌లు ఉన్నారు. నెల రోజుల క్రితం శృతిలయ అనారోగ్యానికి గురికాగా రిమ్స్‌లో వైద్య పరీక్షలు చేయించారు. చిన్నారి గుండెలో నరం బ్లాక్ అయిందని, ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. వైద్యుల సూచనల మేరకు నెల రోజుల క్రితం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని స్టార్ దవాఖానలో ఆపరేషన్ చేయించారు. అనంతరం ఇంటికి తీసుకొచ్చారు. నెల రోజులుగా ఆరోగ్యంగా ఉన్న శృతిలయ మంగళవారం వేకువ జామున వాంతులు చేసుకోవడంతో రిమ్స్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యం విషమించి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఏకైక కూతురు మృతి చెందడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. కైలాస్‌నగర్‌లో పండుగ పూట విషదచాయలు అలుముకున్నాయి.

# మామిడి రైతుకు అపార నష్టం



గంగన్నపేట్‌లో నేలరాలిన మామిడి కాయలు

ఉట్నూర్ రూరల్, ఏప్రిల్ 9 : మండలంలో రెండు రోజులుగా వీస్తున్న ఈదురుగాలులకు మామిడి కాయలు నేలరాలాయి. దీంతో రైతులకు అపార నష్టం చేకూరింది. గతేడాది కంటే ఈసారి పూత, కాత ఎక్కువగా ఉందని రైతులు సంతోష పడుతున్న సమయంలో ఈదురుగాలులు రైతులను ముంచాయి. మరో 20 రోజుల్లో కోతకు రానున్నాయి. ఇంతలోనే 30 శాతం కాయలు రాలిపోయాయి. మరో నాలుగు రోజులపాటు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చిన పంట కండ్ల ముందే పాడవుతుంటే దిక్కుతోచని స్థితితో రైతులు ఉన్నారు. పంట పూర్తిగా పాడైతే ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

# రాంజీగోండ్ సేవలు మరువలేనివి..

### మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, ఏప్రిల్ 9 : గిరిజన హక్కుల సాధన కోసం పోరాడిన రాంజీగోండ్ సేవలు మరువలేనివని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. రాంజీగోండ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదిలాబాద్ పట్టణంలోని బస్‌స్టాండ్ ఎదుట గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంతకుముందు ఆదివాసీ సంఘాల నేతలు రాంజీగోండ్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. ఆదివాసీ గిరిజనుల హక్కుల సాధన కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన రాంజీగోండ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఆ మహనీయుడు చూపిన బాటలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిడాం రాంకిషన్, రోకండ్ల రమేశ్, కుమ్ర రాజు, మెట్టు ప్రహ్లాద్, విజ్జగిరి నారాయణ, రాజన్న, ఆశన్న, మమత, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట తెలంగాణ స్టూడెంట్ ఫోరం సొసైటీ ఆధ్వర్యంలో రాంజీగోండ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.



విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, నాయకులు



నేరడిగొండ మండలంలో అరక పట్టి దుక్కి దున్నుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

# 'క్రోధి'కి స్వాగతం

## వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టిన రైతులు



బాసరలో వేకువజామునే చేలలో పూజలు చేస్తున్న రైతు



అంబలి కలుషాలతో పొలానికి వెళ్తున్న మహిళ

***ఉగాది పర్వదినాన్ని*** *ప్రజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నూతన తెలుగు సంవత్సరం క్రోధికి స్వాగతం పలుకుతూ ఇండ్లలో పూజలు నిర్వహించారు. ఉదయాన్నే మామిడి తోరణాలతో అలంకరించారు. పిండి వంటలు, షడ్రుచుల పచ్చడితో పండుగను జరుపుకున్నారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడగా.. పండితులు పంచాంగ శ్రవణం చేశారు. వివిధ సంస్థల ఆధ్వర్యంలో పచ్చడి పంపిణీ చేశారు. ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఎడ్లను అందంగా అలంకరించారు. వ్యవసాయ పనిముట్లకు పూజలు చేశారు. అరక దున్ని, చేలలోనే కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సంవత్సరం గొడ్డు గోదా, పాడి పంటలు మంచిగా ఉండాలని వేడుకున్నారు. కాగా.. బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో నూతన సంవత్సర వేడుకలు వైభవంగా జరిగాయి. దేశ, రాష్ట్ర ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు, అనుగ్రహం ఉండాలని వేడుకున్నట్లు వైదిక బృందం తెలిపింది. నేరడిగొండ మండలంలో బోథ్ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి అరక పట్టి దున్నారు. అలాగే ఆదిలాబాద్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి జోగు రామన్న పూజలు చేశారు. ఉగాది పంచాంగ శ్రవణ పూజను ప్రారంభించి కార్యకర్తలకు ఉగాది పచ్చడి అందజేశారు.*



బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న పండితులు

# నగదు పట్టివేత

జైనథ్, ఏప్రిల్ 9 : తరోడా(పౌజ్‌పూర్) వద్ద మంగళవారం ఫ్లయింగ్ స్క్వాడ్ టీం లీడర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బృందం సభ్యులు వాహనాలను తనిఖీ చేశారు. బేల మండలంలోని టాక్లీ గ్రామానికి చెందిన కిరణ్(ఎంహెచ్ 29 ఆర్ 6156) నంబర్ గల వాహనంలో రూ.1.96 లక్షలను ఎలాంటి పత్రాలు లేకుండా మహారాష్ట్రలోని దహేగాంకు తరలించే క్రమంలో పట్టుకున్నారు. నగదును జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు వెంకటరమణ, గణేశ్, వీడియోగ్రాఫర్ చంద్రశేఖర్, డ్రైవర్ జహీర్ ఉన్నారు.

# అన్నం ముద్ద లోపలికి వెళ్లకముందే..

### వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టి.. సహపంక్తి భోజనం చేస్తుండగానే ఘటన



విమలాబాయి(ఫైల్)

కుభీర్, ఏప్రిల్ 9 : ఉగాదిని పురస్కరించుకుని కుటుంబ సభ్యులతో కలిసి చేనుకు వెళ్లిన విమలబాయి(45) అందరికీ వడ్డించి కలిసి భోజనం చేయకుండానే అనంత లోకాలకు వెళ్లింది. పార్డి(కె) గ్రామానికి చెందిన తిర్మన్‌పెల్లి విమలాబాయి, ఆమె భర్త సంభాజీ, మరిది విఠల్, ఇద్దరు కూతుర్లు, కుమారుడితోపాటు తోటి కోడలుతో కలిసి మంగళవారం చేనులో వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో విమలాబాయి అందరికీ వడ్డించి తాను భోజనం చేద్దామని నోట్లోకి బుక్క పెట్టుకుంటుండగానే ఒక్కసారిగా కుప్పకూలింది. కుటుంబ సభ్యులు భైంసాకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఈ హృదయ విదారక ఘటన కలిచివేసింది.

# మాజీ మంత్రిని కలిసిన నాయకులు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 9 : మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని మంగళవారం నిర్మల్ పట్టణంలోని శాస్త్రినగర్ కాలనీలో గల తన నివాసంలో పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ మొక్కను అందించి క్రొధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసిన వారిలో నాయకులు రాంచందర్, రాము, మహేశ్ ఉన్నారు.

# 30 పోలీస్ యాక్ట్ అమలు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 9 : జిల్లాలో శాంతిభద్రతల దృష్ట్యా, ప్రశాంతతను పెంపొందించేందుకు ఈనెల 1 నుంచి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. జిల్లా సబ్ డివిజనల్ అధికారి, పోలీస్ ఉన్నతాధికారుల అనుమతి లేకుండా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు చేయరాదని, మారణాయుధాలను వాడరాదని పేర్కొన్నారు. ఇబ్బందులు కలిగించే మీటింగ్‌లు నిషేధమని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# తగ్గిన నీరు.. పెరగని చేప..

### ఆదిలాబాద్ జిల్లాలో ప్రాజెక్టులు, చెరువుల్లో నీటి కరువు

### మత్స్యకారుల ఉపాధిపై ప్రభావం



నీరు లేక వెలవెలబోతున్న సాత్నాల ప్రాజెక్టు

ఆదిలాబాద్, ఏప్రిల్ 9(నమస్తే తెలంగాణ) : మత్స్యకారుల కుటుంబాలను ఆదుకునేందుకు కేసీఆర్ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకున్నది. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువులకు మరమ్మతులు చేపట్టింది. దీంతో పాటు మత్స్యకారుల కుటుంబాలకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసింది. ఆదిలాబాద్‌లో రూ.10 లక్షలతో చేపల మార్కెట్‌ను నిర్మించి మార్కెటింగ్ సౌకర్యం కల్పించింది. వలలు, ఇతర సామగ్రిని అందించింది. చేపలను విక్రయించుకునేందుకు ద్విచక్ర, ఫోర్ విల్లర్స్‌ను పంపిణీ చేసింది. ఆదిలాబాద్ జిల్లాలో 85 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో 4,496 మంది సభ్యులుగా ఉన్నారు. జిల్లాలో గతేడాది జూలైలో కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టులు, చెరువులు నిండిపోయాయి. ప్రాజెక్టులు గరిష్ఠ నీటిమట్టానికి చేరుకోవడంతో గేట్లు ఎత్తి నీటిని దిగువనకు వదిలారు. మత్స్యకారులకు ఉపాధిని మెరుగుపర్చడానికి కేసీఆర్ ప్రభుత్వం గతేడాది వానకాలంలో 222 చెరువులు, రెండు రిజర్వాయర్‌లలో 1.18 కోట్ల చేప పిల్లలను, 14.61 లక్షల రొయ్య పిల్లలను వదిలారు.

### ఉపాధిపై ప్రభావం

జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువుల్లో చేపలను కొనుగోలు చేయడానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చేవారు. గతేడాది జిల్లాలో 222 చెరువులు, రెండు ప్రాజెక్టుల్లో వదిలిన చేప పిల్లలు పెరిగిన తర్వాత ఈ సమయంలో మత్స్యకారులు పట్టుకుని విక్రయించేవారు. జిల్లాలో 6 వేల టన్నులకుపైగా చేపల ఉత్పత్తి జరుగుతుందని అధికారులు అంచనా వేశారు. జిల్లావ్యాప్తంగా జూలైలో మాత్రమే వర్షాలు బాగా పడగా ఆ తర్వాత పడలేదు. ఫలితంగా సాగు నీటి వనరుల్లో నీటిమట్టం తగ్గిపోవడంతో చేప పిల్లల పెరుగుదలపై ప్రభావం పడింది. చేప పిల్లల పంపిణీ జాప్యం కూడా ఉత్పత్తి తగ్గడానికి కారణంగా చెప్పవచ్చు. ప్రాజెక్టులు, చెరువుల్లో వదిలిన చేపపిల్లలు అరకిలో వరకు మాత్రమే పెరగడంతో ధర సరిగా రాదని, విక్రయించి లాభం లేదని లబ్ధిదారులు మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. యేటా ఈ సమయానికి ఆదిలాబాద్ చేపల మార్కెట్ కొనుగోలుదారులతో రద్దీగా ఉండేది. ఇప్పుడు చేపలు సరిగా రాక జనం కనిపించడం లేదు. చేపలను కొనుగోలు చేయడానికి ఇతర రాష్ట్రాల నుంచి రావడం లేదు. ఈ ఏడాది చేపల ఉత్పత్తి తగ్గిపోవడంతో మత్స్యకారులకు ఉపాధి కరువైంది. కుటుంబపోషణకు వారు ఇతర పనులు చేసుకోవాల్సి వస్తున్నది.

# పేదోడి ఫ్రిజ్

## ఆదిలాబాద్ రంజన్లకు భలే గిరాకీ

- ప్రతి వేసవిలో కుమ్మరులు బిజీబిజీ
- ప్రధాన పట్టణాలకు తరలుతున్న రంజన్లు

*ఆదిలాబాద్ రంజన్లకు భలే గిరాకీ ఉంది. నీటిని చల్లబరచడంలో ప్రత్యేకత కలిగినవి కావడం, ఆరోగ్యానికి మేలు చేస్తుండడంతో గిరాకీ బాగుంటుంది. వీటి తయారీని కుమ్మరులు ఆరు నెలల ముందు నుంచే ప్రారంభిస్తారు. వీటిపై ఆధారపడి జిల్లాలో వందల సంఖ్యలో జీవనం సాగిస్తున్నాయి. వీటి తయారీలో కుమ్మరుల కళ, నైపుణ్యం ఉట్టిపడుతున్నది. రంజన్లు విభిన్న రూపాల్లో, యంత్రాలకు దీటుగా తయారై ఆకట్టుకుంటున్నాయి. తయారీదారులు, అమ్మకందారులకు మాత్రం కాసులు కురిపిస్తున్నాయి. ఒక్కొక్క రంజన్ సైజులను బట్టి సుమారు రూ.100-రూ.200 వరకు ధర పలుకుతుండగా.. ప్రతి కుటుంబం దాదాపు రూ.50 వేలకుపైగా సంపాదిస్తున్నది. జిల్లావ్యాప్తంగా లక్షల రూపాయల బిజినెస్ అవుతున్నది.*

*- ఉట్నూర్ రూరల్, ఏప్రిల్ 9*

ఆదిలాబాద్ జిల్లా రంజన్ల తయారీకి పెట్టింది పేరు. ఆదిలాబాద్, ఉట్నూర్, సిరికొండ, జన్నారం, బోథ్ మండలాల్లోని పలు గ్రామాల్లో కుమ్మరులు భారీ సంఖ్యలో తయారు చేస్తున్నారు. ఐదు దశాబ్దాలుగా తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వేసవికి ఆరు నెలల ముందు నుంచే తయారిని ప్రారంభిస్తారు. యేటా నవంబర్ నుంచే ముడిసరుకులు తెచ్చుకుంటారు. మన రంజన్లను మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్, కరీంనగర్, గోదావరిఖని, పెద్దపెల్లి, లక్షెట్టిపేట, జగిత్యాల, కాగజ్‌నగర్ పట్టణాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తారు. అదీకాక మట్టిపొయ్యిలు, గళ్లగురిగీలు, కుండలు, పాత్రలు లాంటివి కూడా తయారు చేస్తారు. మొత్తానికి ప్రతి వేసవికాలంలో ఇటు తయారీదారులకు, అటు అమ్మకందారులకు జిల్లా రంజన్లు కాసులు కురిపిస్తాయి.

### గుర్రపు లద్ది.. మట్టి..

ఆదిలాబాద్ జిల్లాకు 120 కిలో మీటర్ల దూరంలో ఉన్న మహారాష్ట్రలోని యావత్మాల్ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి కుమ్మరులు గుర్రపు లద్ది(పేడ) తీసుకొస్తారు. ఈ పేడ గడ్డిపోచల మాదిరిగా ఉంటుంది. కాగా.. లద్ది, నల్లమట్టి, ఎర్రమట్టి, బూడిదను కొనుగోలు చేస్తారు. రెండు గుల్లల లద్దిపై నీళ్లు చల్లి నానబెడుతారు. మూడు గంటలు నానిన తర్వాత పేడను చూర చేస్తారు. అలా చేస్తేనే అది మట్టిలో కలుస్తుంది. ఈ ప్రక్రియకు ముందే నాలుగు గుల్లల నల్ల, ఎర్ర మట్టి బెడ్డలను పగుల గొట్టి చూర చేస్తారు. ఆ తర్వాత నానబెడతారు. ఒక గుల్ల బూడిదను సిద్ధంగా ఉంచుతారు. ఈ మూడు సమపాలుగా ఉంటేనే మిశ్రమం సరిగా ఉంటుంది.

### గట్టు.. కచ్చు.. అచ్చు..

అడుగు తర్వాత రంజన్ తయారీలో గట్టు, కచ్చు వేస్తారు. ఇందులో కుమ్మరోళ్ల కళ ఆకట్టుకుంటుంది. చేతితోనే ఈ కళకు నైపుణ్యం అద్ది, యంత్రాలకు దీటుగా తయారు చేస్తారు. రంజన్ అడుగుభాగం కంటే మధ్యభాగం వెడల్పు ఎక్కువగా ఉంటుంది. అడుగు పైన మిశ్రమాన్ని ఉంచి దాని బయట వైపు గుండ్రంగా ఒత్తిపెడుతూ వరుస వరుసకు వెడల్పు పెంచుతూ పోతుంటారు. మధ్యభాగం తర్వాత.. పైఅంచుకు కింద వెడల్పు మళ్లీ తగ్గుతుంది. సల్ప, రౌతు సహాయంతో దీన్ని మొత్తుతూ రంజన్‌కు ఓ రూపాన్ని తెస్తారు. పైన అంచు కూడా ఇలాగే పూర్తి చేస్తారు. కుండల తయారీలో చక్రాన్ని ఉపయోగిస్తారు. కానీ.. రంజాన్ పూర్తిగా చేతిలోనే తయారవుతుంది.

### ఎండే ఆధారం..

రంజన్ల తయారీ ఒక ఎత్తయితే వాటిని ఎండబెట్టడం మరో ఎత్తు. ప్రతి కుటుంబం రోజూ 5-10 రంజన్లు తయారు చేస్తుంది. కుటుంబం మొత్తంగా ఇదే పనిపై ఉంటుంది. ఇలా పది రోజులకు 50-100 వరకు రంజన్లు తయారు చేస్తారు. ఏ రోజుకు ఆ రోజు తయారైన రంజన్లను వెంటనే ఎండలో పెడుతుంటారు. ఆ సమయంలో వర్షం పడినా.. ఎండ సరిగా లేకపోయినా వారు నష్టపోయే ప్రమాదం ఉంది. అందుకే ఎండలు బాగా ఉన్న సమయంలోనే వీటిని తయారు చేస్తుంటారు. అలా పది రోజులపాటు వాటిని ఎండలో పెడతారు. తదుపరి వాటిని పరిశీలించి.. ఏమైనా పగుళ్లు ఏర్పడ్డాయా అని చూస్తారు. ఒక వేళ పగుళ్లు ఏర్పడినట్లు కనిపిస్తే వాటిని మట్టితో మొత్తుతారు.

### కొట్టొచ్చే రంగు..

ఎండిన రంజన్లకు తర్వాత కింద భాగం వరకు ఎర్రని జాజు రంగు రుద్దుతారు. పై అంచుకు బింకం రంగు వేస్తారు. ఇందుకోసం వారు ప్రత్యేకంగా కూలీలను పెడతారు. ఈ కూలీలు బట్ట సాయంతో రంగు అద్దుతారు. ఇందుకు ఒక్కో రంజన్‌కు ఐదు నిమిషాలు పడుతుంది. రంజన్ ప్రత్యేకతను చాటేలా ఎర్రని జాజురంగు కొట్టొచ్చేలా దాన్ని అందంగా అలంకరిస్తారు. పైన అంచుకు వేసే బింకం రంగు కూడా ప్రత్యేకమే. ఇది మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో రాయి దొరుకుతుంది. దాన్ని పొడిలా మార్చి నానబెడుతారు. సాధారణంగా 10,30 లీటర్ల నీళ్లు పట్టే రంజన్లు ఇక్కడ తయారు చేస్తారు. ఎవరైనా ఆర్డర్ చేస్తే వారికి అనుగుణంగా కూడా తయారు చేస్తారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న రంజన్లు

### బట్టీలో కాల్చడం..

రంగులు పడ్డ తర్వాత రంజన్లను బట్టీ(ఆమం)లో కాలుస్తారు. బట్టీలో అడవిలో దొరికే చెక్కపొల్లును వినియోగిస్తారు. అది సరిపోకుంటే పాత టైర్లను వేసి రాత్రి కాల్చుతారు. అలా మూడు గంటలపాటు మంటల్లోనే ఉంచుతారు. సుమారు ఒక్కో బట్టీలో 100-120 వరకు రంజన్లు పెడుతారు. మధ్యమధ్యలో పగిలిన పెంకులను వినియోగిస్తారు. మంటతో వచ్చే పొగ రంజన్లను కాల్చిన తర్వాత బట్టి తొలగించగా.. కనీసం 10 నుంచి 20 శాతం వరకు పగులుతాయి.

### 'అడుగు'తో మొదలు..

అడుగుతో రంజన్ తయారీ ప్రక్రియ ప్రారంభమవుతుంది. అడుగు వేసే ముందు మిశ్రమం భూమికి అంటుకోకుండా జల్లెడతో బూడిద గుండ్రంగా నేలపై పోస్తారు. దానిపై అడుగుకు సరిపడా మిశ్రమాన్ని ముద్దలు ముద్దలుగా పేడుతారు. ఒక చేతిలో కర్రతో తయారు చేసిన సల్ప, మరో చేతిలో రాయి పట్టుకుని అడుగును తయారు చేస్తారు.

### ముడిసరుకులు

గుడ్డపు లద్ది, నల్లమట్టి, ఎర్రమట్టి, బూడిద, ఎర్రని జాజు, బింకం రంగు, చెక్కపొల్లు,



మట్టిలో కలపడానికి తెచ్చిన గుర్రపు పేడ

### ఆరోగ్యానికి ఎంతో మంచివి..

మట్టితో తయారు చేసిన రంజన్ల నీరు తాగితే ఆరోగ్యానికి ఎంతో మంచిదని వైద్యులు చెబుతున్నారు. శరీరంలో వేడిని తగ్గించేందుకు ఈ మట్టి రంజన్లు ఉపయోగపడతాయి. రంజన్ల వాటర్ చాలా చల్లగా ఉంటుంది. ఎలక్ట్రికల్ ఫ్రిజ్‌ల కన్నా ప్రజలకు రంజన్లే చాలా మేలు చేస్తాయి. పైగా ఫ్రిజ్‌తో శరీరానికి వేడి, వేసవిలో ఫ్రిజ్‌లతో చాలా విద్యుత్ ఖర్చవుతుంది.

### కుటుంబానికి ఉపాధి లభిస్తుంది..



*ఇంటిల్లి పాది కష్ట పడితే ఒకే సీజన్(ఆరు నెలలు) రూ.50 వేల వరకు సంపాదిస్తాం. ఒక్క రంజన్ 150 వరకు అమ్ముతాం. ఒక ట్రాక్టరు మట్టికి రూ.2,500, గుర్రపుపేడ కిలోకు రూ.20, బండెడు కట్టెలకు రూ.2,500 ఖర్చవుతాయి. మాకు భూమి లేదు. వర్షాకాలంలో కూలి పని చేసుకుంటూ ఎండాకాలంలో ఐదు నెలలపాటు ఇదే పని చేస్తాం. ఇంటిలో నలుగురం కష్టపడుతాం. మా కుటుంబానికి మంచి ఉపాధి అయితే లభిస్తుంది.*

***- కేలేటి సుభాష్, కుమ్మరితాండ.***

### యంత్రాలు, రుణాలు అందించాలి..



*మాది కులవృత్తి రంజన్లు, కుండలు ఇతర పరికరాలు తయారు చేయడం. యంత్ర పరికరాలు అందించి, రాయితీ రుణాలు అందిస్తే బాగుంటుంది. యంత్రాల ద్వారా మరింత ఎక్కువగా తయారు చేయడానికి వీలుంటుంది. చేతులతో తయారు చేయడం ద్వారా రోజుకు 10 వరకు తయారు చేయ గలుగుతాం.*

***- రూప, కుమ్మరితండా.***